# పత్రికా ప్రకటన

**తేది:21.06.2022**

అంతర్జాతీయ యోగా దినోత్సవాన్ని పురస్కరించుకుని ద్రావిడ విశ్వవిద్యాలయంలో ఘనంగా వేడుకలు నిర్వహించారు. మంగళవారం వర్శిటీ సెంటర్ ఫర్ యోగా స్టడీస్ కో-ఆర్డినేటర్, సిడిఎల్పి విభాగాధిపతి ఆచార్య ఎన్.సుశీల ఆధ్వర్యంలో ఉదయం వర్శిటీ శ్రీ కందుకూరి వీరేశలింగం పంతులు ఆడిటోరియంలో ఏర్పాటు చేసిన యోగా దినోత్సవ వేడుకల్లో వర్శిటీ వైస్-ఛాన్సలర్ ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు ముఖ్య అతిథిగా పాల్గొన్నారు.

ఈ సందర్భంగా ఆచార్య తుమ్మల రామకృష్ణ గారు మాట్లాడుతూ... మన భారతదేశంలో పుట్టిన యోగా విద్య నేడు ప్రపంచ నలుమూలల ప్రాచుర్యం పొందిందని అన్నారు. ప్రతి ఒక్కరికీ యోగా సాధన అవసరమని, మనిషి ఎదుగుదలకు, ప్రపంచ శాంతికి యోగా విద్య ఎంతో అవసరమని తెలిపారు. మొత్తం మానవ ప్రపంచానికి అతిప్రాచీన కాలం నుండి కూడా మనం నాగరికతను చూసినప్పుడు గ్రీకు నాగరికత, రోమ్ నాగరికత అటు పాశ్చాత్య దేశాలే కాకుండా భారతదేశం అత్యంత ప్రాచీనమైనటువంటి నాగరికతకు పుట్టినిల్లు అన్నారు. నాగరికత ప్రపంచానికి ఎన్నో అంశాలను భారతదేశం భిక్ష పెట్టిందని చాలా చోట్ల చదివినట్లు తెలిపారు. అతి ప్రాచీన కాలానికి సంబంధించినటువంటి వేద సంపద, ఇతిహాసాలు, పురాణాలు, కావ్యాలు మన దేశానికి విశిష్టమైనటువంటి గౌరవాన్ని అందించిందన్నారు. యోగా శారీరక ధారుఢ్యంతో పాటు మానసిక ఉల్లాసాన్ని అందిస్తుందన్నారు. మనం చేసే ప్రతి పనిలోనూ ఒక ఆసనం ఉంటుందని తల్లి పొయ్యి దగ్గర కూర్చొని వంట చేసేటప్పుడు, బిందెలో నీరు ఎత్తుకునేటప్పుడు, ఇళ్ళు ఊడ్చేటప్పుడు ఇలా అన్నింటిలోనూ యోగా ఆసనాలు వుంటుందన్నారు. సూర్య నమస్కారాలతో మొదలై అనేక ఆసనాల ద్వారా మన శరీరంలో ప్రతి అవయవవానికి ఆసనం ఉంటుందని దీంతో శరీరంలో ఏ రోగం దరిచేరకుండా ఆసనాల ద్వారా ఆరోగ్యంగా ఉంచుకోవచ్చుని తెలిపారు. మనసును ప్రశాంతంగా తమ ఆధీనంలో ఉంచుకోవడానికి యోగాసనాలు ఎంతో ఉపయోగపడుతుందని, దీని వలన ఏకాగ్రత, క్రమశిక్షణ, మానసిక ఉల్లాసం కలగడంతో పాటు మన జీవితకాలం పెరుగుతుందని అన్నారు.

అంతర్జాతీయ యోగా దినోత్సవం సందర్భంగా విద్యార్థులకు నిర్వహించిన పోటీల్లో గెలుపొందిన వారికి ధృవీకరణ పత్రాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో వర్శిటీ రిజిస్ట్రార్ డా.ఎ.కె.వేణుగోపాల్ రెడ్డి, డీన్ అకడమిక్ అఫైర్స్ ఆచార్య అక్యుటర్ బాబు, పీఠాధిపతులు, విభాగాధిపతులు, బోధన బోధనేతర సిబ్బంది, పరిశోధక విద్యార్థులు, విద్యార్థినీ విద్యార్థులుపాల్గొన్నారు.

**- డా.పి.మురళీకృష్ణారెడ్డి, పిఆర్ఓ, ద్రావిడ విశ్వవిద్యాలయం, కుప్పం**


DRAVIDIAN UNIVERSITY









